క్లుప్తంగా

ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు



రాజాపూర్: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్వేనంబర్ 49లో తన పొలానికి దారి లేదంటూ దారి ఇప్పించాలని డేగావత్ మాణ్య అనే రైతు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటున్నా ఫిర్యాదులు రావడం లేదని వారు చెబుతున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని ధర్మాపూర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించడం గొప్పవిషయమని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. సోమవారం వాగ్దేవి కళాశాల ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌లో ఉన్న అంశాలను పూర్తిస్థాయిలో చదివితే విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీధర్‌కు ఘన సన్మానం



హన్వాడ: మండలంలోని గొండ్యాల్‌కు చెందిన శ్రీధర్ మన్‌కీబాత్ కోకన్వీనర్‌గా ఎంపికయ్యారు. సోమవారం బీజేపీ నాయకులు ఆయన స్వగ్రామానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రఘురాములుగౌడ్ మాట్లాడారు. మూరుమూల ప్రాంతాలకు, గ్రామాలకు చెందిన కార్యకర్తలను గుర్తించడంలో బీజేపీ ముందుంటుందని అన్నారు. శ్రీధర్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



హన్వాడ: మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ రాజు కుమారుడికి గుండె చికిత్సకోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.సురేందర్ రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. కాంగ్రెస్ కార్యకర్త అయిన మేస్త్రీ రాజు కుమారుడు నరేష్ కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సురేందర్‌రెడ్డి రూ.లక్ష నగదును బాధిత కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబీకులు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణయ్య, నాయకులు వెంకటయ్య, గంగాపురి, పెంటయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా పొన్నకల్ - దాసర్‌పల్లి రోడ్డు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ నుంచి మూసాపేట మండలంలోని దాసర్‌పల్లికి వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఆగుంతల్లో వర్షం నీళ్లు నిలిచి వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండాపోతుంది. పొన్నకల్ గ్రామస్తులు దాసర్‌పల్లి వెళ్లడానికి నందిపేట ఎక్స్‌రోడ్డు మీదుగా చెన్నంపల్లి దాటి వెళ్తున్నారు. దీంతో నాలుగైదు కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ రోడ్డును బాగుచేయిస్తే రెండు గ్రామాల ప్రజలకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.



ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండలో ప్రత్యేక పూజ చేస్తున్న అర్చకుడు



మహబూబ్‌నగర్‌లోని సరస్వతీదేవి ఆలయంలో భక్తులు

- దర్శనాలకు తరలివచ్చిన భక్తులు
- అన్నదాన కార్యక్రమాలు
- తీర్థప్రసాదాలు అందజేత

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

■ అడ్డాకుల మండలంలోని కందూర్ సమీపంలో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

■ కోయిల్‌కొండ మండలంలోని శ్రీరామకొండపై



కందూర్‌లో అభిషేకాలు చేస్తున్న భక్తులు

స్వామివారికి ప్రత్యేక అభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, అష్టోత్తర శతనామావళి పూజలను నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్ రావు తెలిపారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

■ జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండా వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేసి హోమం జరిపించి అన్నదానం చేశారు. పెద్దగుట్ట వద్ద ఉన్న వీరభద్రుడి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వీరభద్రుడి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. మాసశివరాత్రి పురస్కరించుకుని మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి పల్లకీసేవ జరిపించారు.

■ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్‌లోని సరస్వతీ దేవి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గుడి చుట్టూ అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాగరాజుతోపాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నేడు (మంగళవారం) నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్ నంబర్ 9959226286కు తెలియజేయాలని ఆమె కోరారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడితగ్గించుకోవచ్చు



చిన్నచింతకుంట: ధ్యానంతో మానసిక ఒత్తిడి తగ్గించుకోవచ్చని ధ్యాన శిక్షకులు పరమేశ్వరి, రాజుగౌడ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానంను ప్రతి ఒక్కరూ దినచర్యగా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, శశికుమార్, కృష్ణవేణి, అనసూయ, రాజేష్, రేష్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆపదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా నాయకుడు పరమేశ్వర్‌గౌడ్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యసభలో అంబేడ్కర్ పేరును ఉచ్చరిస్తూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంపై మండి పడ్డారు. సీపీఎం నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, రాజ్‌కుమార్, వర్ధగాలెన్న, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



అడ్డాకులలో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అడ్డాకుల: అపరిచిత వ్యక్తులు మొబైల్ ఫోన్లకు పంపే లింకులను ఓపెన్ చేయవద్దని ఏఎస్ఐ రాజేశ్వర్ రావు సూచించారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో అడ్డాకుల పోలీసులు సైబర్ మోసాలపై ప్రయాణికులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్ నంబర్లను అనవసరమైన కొత్త వ్యక్తులతో షేర్ చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా ఒకవేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను వాడేవారు అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరాలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజు, సద్దాం తదితరులున్నారు.

విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకారం తప్పనిసరి

మహమ్మదాబాద్: విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకారం తప్పనిసరి అని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వార్షిక సన్నద్ధ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో చదువుకున్నంత మాత్రాన పరీక్షల్లో మంచి ఫలితాలు తెచ్చుకుంటారన్న అపోహలు వీడాలన్నారు. తల్లిదండ్రులు నిత్యం తమ పిల్లల చదువు, క్రమశిక్షణను పరిశీలించాలని సూచించారు. అప్పుడే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్

వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు పెట్టాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడలో ఇటీవల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములుపై దాడికి పాల్పడినవారిపై అట్రాసిటీ కేసు పెట్టాలని టీపీఎస్కే, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు వి.కురుమూర్తి, నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈదాడికి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, సంఘ్ పరివార్ సంస్థలే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా బాధ్యులను గుర్తించి పోలీసులు వెంటనే అరెస్టు చేయాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆదిత్య, వి.పద్మ, వరద గాలన్న, కడియాల మోహన్, ఎ.రాములు, సుమిత్ర, సుశీల, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీఎస్కే జిల్లా కార్యదర్శి వి.కురుమూర్తి

కఠినంగా శిక్షించాలి

జడ్చర్ల: రంగారెడ్డి జిల్లాలో దళిత హెచ్ఎంపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. దాడిని నిరసిస్తూ సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి నాగరాజు, లక్ష్మీదేవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



కురుమూర్తి స్వామి ఆలయ రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి దర్శనానికి సోమవారం అమావాస్య రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు ఆలయ శుద్ధి అనంతరం సుప్రభాత సేవ నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచే క్యూలైన్‌లో నిలబడ్డారు. కొందరు భక్తులు మెట్టు మెట్టుపై దీపం వెలిగిస్తూ గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు, అన్నం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వండి నైవేద్యంగా స్వామికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రాజాపూర్: నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించాలనుకునే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతుల్లేవని, ఎక్కడైనా డీజేలతో వేడుకలు నిర్వహిస్తే వాటిని సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం అమ్మడం, సేవించడం చేయరాదన్నారు. తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామని తెలిపారు.

కఠినచర్యలు తప్పవు

నవాబుపేట: కొత్త ఏడాదంటూ అతిగా మద్యం తాగటం, డీజేలు తదితర వాటితో ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ విక్రమ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు విస్మరించి రోడ్లపైకి వస్తే డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే వారి తల్లిదండ్రులు శిక్షార్హులని హెచ్చరించారు. కొత్త ఏడాదిని ఘనంగా స్వాగతించాలని, అందరూ ప్రశాంత వాతవరణంలో సంబరాలు జరుపుకోవాలని ఆయన సూచించారు.

మరో బస్సు నడపాలని విద్యార్థుల ఆందోళన

అడ్డాకుల: మహబూబ్‌నగర్ నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం మరోబస్సు నడపాలంటూ మూసాపేట మండలం చక్రాపూర్‌లో సోమవారం రాత్రి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సు ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నుంచి జానంపేట మీదుగా చక్రాపూర్, లక్ష్మీపల్లి, అజిలాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల మీదుగా దేవరకద్రకు ఒకే ఆర్టీసీ బస్సును నడిపిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో ఈరూట్‌లో రెండు బస్సులు నడిచేవని, కొన్నాళ్ల నుంచి ఒకే బస్సును నడిపిస్తుండటంతో విద్యార్థులు ఇళ్లకు



చక్రాపూర్‌లో బస్సు ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

చేరేసరికి రాత్రి 7గంటలు దాటుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తమ గ్రామం మీదుగా రెండు బస్సులను నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా దీపారాధన

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్రత్ అబ్దుల్ ఖాదర్‌షా రహెమతుల్లా అలై 86వ ఉర్సులో భాగంగా సోమవారం రాత్రి దీపారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సును పురస్కరించుకొని దర్గా ఆవరణలో చిన్నపిల్లల ఆట వస్తువులు, మిఠాయిలతో పాటు పలురకాల ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. మహబూబ్‌నగర్‌తో పాటు చుట్టుపక్కల



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ప్రాంతాల నుంచి ప్రజలు దర్గాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఇందిరమ్మ సర్వే 92శాతం పూర్తి

నవాబుపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సోమవారం 92శాతం పూరయినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. సర్వే 100 శాతం పూర్తి చేయటానికి 24గంటల సమయం ఉండగా 92శాతం పూర్తి కావటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండలం మొత్తం 15,480 ఇళ్ల సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటికే 14,257ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

క్రికెట్ కిట్ అందజేత

దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లిలో జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రికెట్ టోర్నీలో పాల్గొనే గ్రామీణ యువ క్రీడాకారులను కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి క్రికెట్ కిట్‌ను అందజేశారు. యువత క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.

క్రీడా దుస్తులు పంపిణీ

జడ్చర్ల: చాంపియన్స్ క్రికెట్ టోర్నీలో పాల్గొనడానికి వెళ్తున్న బీఆర్ఆర్ క్రికెట్ జట్టుకు ఫ్లయ్‌వాక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి సోమవారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సుకన్య బ్యాట్, బాల్, గ్లౌజులు అందజేశారు. కార్యక్రమంలో సదాశివయ్య, వెంకటేశ్వర్లు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదాల..

దేవరకద్ర: మండలంలోని ఈశ్వర వీరప్పయ్యస్వా మి దేవాలయంలో సోమవారం భక్తులకు అన్నప్రసాదాలను పంచారు. గ్రామానికి చెందిన గోవిందు వెంకటకృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు సుదర్శన్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు ఎస్సీ ఉప వర్గీకరణపై అధ్యయనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం మంగళవారం విచారణ కమిషన్ తరఫున హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సమీమ్ అక్తర్‌తో పాటు సభ్యులు రానున్నట్లు కలెక్టర్ విజయేందిర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందని, ఉమ్మడి జిల్లా నుంచి సంబంధిత కులాల, వర్గాల ప్రజలు నుంచి దరఖాస్తులు తీసుకొని, వాటికి సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేజీబీవీ ప్రారంభం

- హాజరుకానున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ దేవన్న, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గండేడ్ మండలం ఏర్పాటైన తరువాత కొత్తగా కేజీబీవీ మంజూరైందన్నారు. ఏడాదైనా ప్రారంభం కాలేదని, దీంతో మహమ్మదాబాద్ కేజీబీవీలోనే తరగతులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గండేడ్ విశ్వభారతి కళాశాలలో అకామిడేషన్ లీజుకు తీసుకున్నారు. ఈమేరకు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దీన్ని ప్రారంభిస్తారన్నారు. 2.30గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, 3.30కు ఇందిరమ్మ ఇళ్ల మోడల్ బిల్డింగ్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ)లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పీయూ ముఖద్వారం వద్ద జెండాను అధ్యాపకుడు గాలెన్న ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుంచి విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు అనేక పోరాటాలు చేసిందన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఇబ్బందులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ తనదైన ముద్ర వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, రాజేష్, వంశీ, గణేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కోయిల్‌కొండ: స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.ఉమేష్‌నాయక్ అనే విద్యార్థి ఆదివారం అదృశ్యమైనట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఉమేష్‌నాయక్ 29న సాయంత్రం పాఠశాల ఆవరణలో స్పోర్ట్స్ ఆడుకోవడానికి వెళ్లాడు. అనంతరం కనిపించకపోవడంతో ఉపాధ్యాయుడు రమేష్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఉమేష్‌నాయక్

'పాలమూరు' ఎత్తిపోతలపై కుట్రలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ నుంచి డిండి ప్రాజెక్ట్ ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీరందించేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో 159ను రద్దు చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఇప్పటికే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ఉందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా పాలమూరు ప్రాజెక్ట్‌లోని ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే పాలమూరు జిల్లాలోని కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లకు నీరు అందని పరిస్థితి తలెత్తనుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి త్వరగా ఇక్కడి రిజర్వాయర్లను నీటితో నింపాలని డిమాండ్ చేశారు.

జూడో రన్నరప్‌గా మహబూబ్‌నగర్

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, కేడేట్ బాలబాలికల జూడో పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.
- స్టేషన్ మహబూబ్‌నగర్

